క్లుప్తంగా

కిషన్‌రెడ్డికి సన్మానం



కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న రమేష్‌గౌడ్

నర్సాపూర్: జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు బుధవారం హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా కిషన్ రెడ్డికి బొకె ఇచ్చి శాలువా కప్పి సన్మానించారు.

ఈటలను కలిసిన బీజేపీ నాయకులు



ఈటలను సన్మానించి శుభాకాంక్షలు తెలుపుతున్న మురళీయాదవ్

నర్సాపూర్: బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్‌గా నియమితులైన హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను బుధవారం నర్సాపూర్‌కు చెందిన పలువురు పార్టీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీ యాదవ్ హైదరాబాద్‌లో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

రామాయంపేట(మెదక్): బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వాహణ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన ఈటల రాజేందర్‌ను బుధవారం జిల్లా నాయకులు, కార్యకర్తలు కలిసి సన్మానించారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నందు జనార్దన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, నల్లాల విజయ్, అసెంబ్లీ కన్వీనర్ మధు, జిల్లా అధికార ప్రతినిధులు నందారెడ్డి, శ్రీనివాస్, రామాయంపేట నాయకులు పాల్గొన్నారు.

‘చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి’



వాలీబాల్ కిట్లు అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు ఖాసీం

చిలప్‌చెడ్(నర్సాపూర్): యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని చండూర్ బీఆర్‌ఎస్ నాయకుడు జయరాంరెడ్డి అన్నారు. చిలప్‌చెడ్ మండలం చండూర్ గ్రామ యువకులకు జయరాంరెడ్డి సహకారంతో బుధవారం వాలీబాల్ కిట్‌లను ఖాసీం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉంటారన్నారు.

విద్యార్థులకు యూనిఫాం నోట్‌బుక్స్ పంపిణీ



యూనిఫాం, నోట్‌బుక్స్ అందజేస్తున్న దృశ్యం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని సదాశివపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు యూనిఫాం, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. హెచ్‌ఎం యాదగిరి, ఉపాధ్యాయులు మెట్టురాములుశర్మ యూనిఫాంతోపాటు ఈఏడాది నూతనంగా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.

రేగోడ్‌ను సంగారెడ్డి జిల్లాలో కలపాలి



మాట్లాడుతున్న దేవరాజ్

రేగోడ్(మెదక్): రేగోడ్ మండలాన్ని సంగారెడ్డి జిల్లాలో కలపాలని దళిత సంఘాల నాయకుడు దేవరాజ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకుడు మాట్లాడుతూ గతంలో జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు చేస్తే తమవంతు మద్దతు తెలిపి దీక్షలో కూర్చున్నామని తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో కలుపుతున్నట్లుగా గెజిట్ విడుదల చేసి మళ్లీ ఆపేశారని మండిపడ్డారు. వంద కిలోమీటర్లకు పైగా ఉన్న కంగ్టి మండలం సంగారెడ్డి జిల్లాలో ఉందని, సుమారు 65 కిలోమీటర్లు ఉన్న రేగోడ్‌ను మాత్రం మెదక్‌లో ఉంచారన్నారు.

దంచి కొట్టిన వాన..!



చిలప్‌చెడ్ మత్తడి వద్ద చేపలు పడుతున్న యువకులు



సంగాయిపేట పత్తి కుంటలో వర్షానికి చేరిన నీటిలో కప్పల సందడి

టేక్మాల్(మెదక్): టేక్మాల్‌లో బుధవారం వాన దంచి కొట్టింది. 56.1 ఎంఎంల వర్షపాతం నమోదైంది. ఈ వర్షానికి పంటచేలలో నీరు నిలవడంతో పాటు వాగులు నీటిమయమయ్యాయి. చెరువు, కుంటలు నీటితో జలమయమయ్యాయి. ఎక్లాస్‌పూర్ పాఠశాలలో పెచ్చులూడి, గోడ వెనకభాగంలో బీటలు వారింది.

కొల్చారం(నర్సాపూర్): మంగళవారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు జల్లులతో కూడిన వర్షం కురిసింది. 6.7సెంటీమీటర్లు నమోదయింది.

పెద్దశంకరంపేటలో..

పెద్దశంకరంపేట(మెదక్): పేట మండలంలో తెల్లవారుఝాము వరకు 58.2 ఎంఎంల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ వర్షంతో పత్తి, పెసర, మినుము తదితర పంటలకు మేలు చేకూరింది.

చిలప్‌చెడ్‌లో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్ మండలంలో 12.5 సెం.మీగా నమోదు అయిందని మండల గణాంకాల శాఖ అధికారి వెంకటేశ్ తెలిపారు. ఈ వర్షానికి పలు గ్రామాలలో కుంటలు నిండాయి.

రామాయంపేటలో..

రామాయంపేట(మెదక్): కాట్రియాల, పర్వతాపూర్, లక్ష్మాపూర్, దంతేపల్లి గ్రామాల్లో భారీ వర్షం పడింది. వాగులు పొంగి పొర్లడంతోపాటు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇక్కడ 5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పాపన్నపేట తహసీల్దార్‌గా లక్ష్మణ్‌బాబు

- ఏడాదిలో 8మంది తహసీల్దార్‌లు
- నగటు పదవీ కాలం 45 రోజులు



తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మణ్ బాబు

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట తహసీల్దార్ పదవీ కాలం మున్నాళ్ల ముచ్చటగా మారుతోంది. ఈ రోజు ఉన్న తహసీల్దార్ రేపు ఉంటాడో లేదో తెలియని ఆగమ్య గోచర పరిస్థితి ఏర్పడింది. గత ఏడాది కాలంలో 8 మంది తహసీల్దార్‌లు మారారు. ఇక్కడ కేవలం 49 రోజుల పాటు పని చేసిన గంగా ప్రసాద్ మంగళవారం బదిలీ అయ్యారు. నూతన తహసీల్దార్‌గా చేగుంటలో పని చేసిన లక్ష్మణ్ బాబు పదవీ బాధ్యతలు స్వీకరించారు. మెదక్ జిల్లాలో పాపన్నపేట అతి పెద్ద మండలం, ఇక్కడ 36 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. రెవెన్యు పరంగా చూస్తే కూడా, అధిక ఆదాయం ఉన్న మండలం. ప్రతీ రోజు కనీసం 15 రిజిస్ట్రేషన్లు అవుతుంటాయి. భూసమస్యలు కూడా ఎక్కువే. ఇంతటి ప్రాధాన్య మున్న మండలంలో చీటికి మాటికి తహసీల్దార్‌లను మారుస్తున్నారు. ఇక్కడ చాలా వరకు డిప్యూటీ తహసీల్దార్‌లకే అదనపు బాధ్యతలు అప్పజెబుతున్నారు. పదే పదే తహసీల్దార్‌లను మారుస్తుండటంతో, రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొత్త తహసీల్దార్‌కు ఇక్కడి పరిస్థితులు అవగాహన అయ్యే లోపే, అతని పై బదిలీ వేటు పడుతుంది. 1997 నుంచి 2023 వరకు 31 మంది తహసీల్దార్‌లు మారగా, 2021 నుంచి జూలై వరకు 9మంది తహసీల్దార్‌లు మారడం గమనార్హం. జూన్ 2021నుంచి జూన్ 2022 వరకు లక్ష్మణ్ తహసీల్దార్‌గా పనిచేయగా, జూన్ 22 నుంచి ఆగస్టు 22 వరకు హరిదీప్‌సింగ్, సెప్టెంబర్ 1నుంచి సెప్టెంబర్ 30 వరకు అల్లం మహేందర్, అక్టోబర్ 1నుంచి అక్టోబర్ 31వరకు మహేందర్‌గౌడ్, నవంబర్ 1 నుంచి ఫిబ్రవరి13, 2023 వరకు అల్లం మహేందర్, ఫిబ్రవరి14 నుంచి ఏప్రిల్ 12 వరకు మధుసూదన్, ఏప్రిల్ 13నుంచి మే 15 వరకు అల్లం మహేందర్, మే15 నుంచి జూలై 4 వరకు గంగా ప్రసాద్ పని చేయగా, తాజాగా లక్ష్మణ్ బాబు కొత్త తహసీల్దార్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా స్వప్న



చేగుంట ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన స్వప్న

చేగుంట(తూప్రాన్): ఇన్‌చార్జి తహసీల్దార్‌గా రామాయంపేట డిప్యూటీ తహసీల్దార్ స్వప్న బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ ప్రజల సహకారంతో అందుబాటులో ఉండి సేవలను అందించనున్నట్లు తెలిపారు. ఎంపీపీ మాసుల శ్రీనివాస్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్, ఎంపీటీసీ వెంకటలక్ష్మిలు శాలువా కప్పి ఆమెను సన్మానించారు.

రెడ్డి సంఘం మండల అధ్యక్షుడిగా ముక్కెర లింగారెడ్డి



రెడ్డి సంఘం సమావేశంలో మండల నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండల రెడ్డి సంఘం మండల అధ్యక్షుడిగా ముక్కెర లింగారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలో రెడ్డి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో చిన్నశంకరంపేట మండల కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సిహెచ్.సిద్దిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, నాగేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సురెడ్డి నరసింహరెడ్డి, కార్యదర్శిగా తిరుపతి రెడ్డి, రామ్‌రెడ్డి, కోశాధికారిగా సాయిరెడ్డిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భాగారెడ్డి, లచ్చిరెడ్డి, చిన్నశంకరంపేట మండల నాయకులు శ్రీమన్‌రెడ్డి, అంజిరెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



పట్టణ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం

తూప్రాన్: పట్టణ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం పట్టణంలోని లక్ష్మీనర్సింహ్మాస్వామి ఫంక్షన్ హాల్లో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడిగా బొడ్డు నాగభూషణం, నందాల శ్రీనివాస్, స్వర్గం వెంకటనారాయణ, అధ్యక్షుడిగా నందాల దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి బొడ్డు రాజు, ఉపాధ్యాక్షుడిగా బొర్ర దుర్గస్వామి, తాటి గోపాల్, యువజన అధ్యక్షుడిగా బోడ్డు రాఘవేందర్, ప్రధాన కార్యదర్శిగా కొండరాజు, ఉపాధ్యాక్షుడిగా నందాల శ్రీధర్, గాడిపల్లి నవీన్, తాటి సంతోష్, యువజన గౌరవ అధ్యక్షుడిగా స్వర్గం శ్రీకాంత్, నందాల నాగరాజు, బొర్ర శివప్రకాశ్, దర్పల్లి భిక్షపతి తదితరులు ఎన్నికయ్యారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి



చిట్కుల్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న మమత

చిలప్‌చెడ్(నర్సాపూర్): సమిష్టి కృషితోనే బాల్య వివాహాల నిర్మూలన సాధ్యమవుతుందని కైలాస్ సత్యార్థి ఫౌండేషన్ కో ఆర్డినేటర్ మమత అన్నారు. బుధవారం ఆమె ఫౌండేషన్ సభ్యులతో కలసి చిటుకల్ గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ గోపాల్‌రెడ్డి, కార్యదర్శి తిరుపతిలతో బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ పెళ్లీ వయస్సు రాని వారికి పెళ్లి చేస్తే తల్లితండ్రులతో పాటు, అందుకు సహకరించిన ప్రతీ ఒక్కరికి శిక్ష పడుతుందన్నారు. ఎవరికైనా బాల్య వివాహం జరుగుతున్నట్టు తెలిసే చైల్డ్ హెల్ప్‌లైన్, పోలీస్‌శాఖ వారికి, ఆ గ్రామ కార్యదర్శికి, అంగన్‌వాడీలకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో భారతి, నజీమా తరున్నమ్ తదితరులు పాల్గొన్నారు.

రూ. లక్ష లోపు రుణం మాఫీ చేయాలి



మాట్లాడుతున్న రమేష్

కొత్తపల్లి సొసైటీ జనసభ తీర్మానం

పాపన్నపేట(మెదక్): రూ.లక్ష లోపు వ్యవసాయ రుణాలు వెంటనే మాఫీ చేయాలని కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘం జనసభ బుధవారం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ త్యార్ల రమేష్ మాట్లాడుతూ సంఘం సభ్యులు ఏక కాలంలో రుణాలు చెల్లించి సంఘ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని అనేక ఆర్థిక, వినిమయ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. సొసైటీ ఆధ్వర్యంలో ఎరువులు, విత్తనాలు, జీలుగా అందుబాటులో ఉన్నాయన్నారు. నానో యూరియా, డీఏపీ బాటిల్‌లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. 25 బాటిల్‌లు కొనుగోలు చేస్తే, ఎలక్ట్రానిక్ పిచికారి మిషన్ ఉచితంగా ఇస్తామన్నారు. సొసైటీ పరిధిలోని కొడుపాక, కుర్తివాడ గ్రామాల్లో 10వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములు నిర్మిస్తామన్నారు. సభ్య రైతులు ఎవరైనా మృతి చెందితే రూ.10వేల ఆర్థిక సహాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లాపూర్ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, ఏడుపాయల మాజీ చైర్మన్ పార్శి నర్సింలు, సందీప్, డీసీసీబీ మేనేజర్ సౌభాగ్య, డైరక్టర్లు శోభారాణి, నర్సింలు, సుధాకర్‌రెడ్డి, నాగమ్మ, మహిపాల్, దుర్గమ్మ, జాఫర్, బీమప్ప, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు



పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని శుభ్రం చేసేచోట మహిళలు

నిజాంపేట(మెదక్): నిజాంపేట మూడో వార్డులోని దళిత కాలనీలో మురికి కాల్వలో పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గర్గుల శ్రీనివాస్, జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ తొలగించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల మురికి కాల్వలో చెత్తాచెదారం, మురుగు చేరడంతో పాములు తేళ్లకు ఆవాసాలుగా మారుతుందన్నారు. అక్కడినుంచి మురుగునీరు ఇండల్లోకి చేరడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ విషయాన్ని జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ఆయన స్పందించి జెసీబీ సాయంతో మురికి కాల్వను శుభ్రం చేయించారన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సొంత నిధులతో వలంటీర్ ఏర్పాటు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి పిల్లుట్ల ప్రాథమిక పాఠశాలకు బీఆర్‌ఎస్ నాయకుడు బండారి గంగాధర్ విద్యా వాలంటీర్‌ని నియమించాడు. పాఠశాలలో 120 మంది విద్యార్థులకు గాను ముగ్గురు టీచర్లు ఉండడంతో బోధనకు ఆటంకం ఏర్పడుతుందని గుర్తించిన గంగాధర్ తన సొంత నిధులతో గ్రామానికి చెందిన వ్యక్తిని విద్యావాలంటీర్‌గా నియమించాడు. 2023-24 విద్యాసంవత్సరానికి గాను వాలంటీర్‌కి సంబంధించిన వేతనం అందజేస్తానన్నారు. సదరు వాలంటీర్ బుధవారం విధుల్లోకి చేరినట్లు ఆయన తెలిపారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయ బృందం గంగాధర్‌ని సన్మానించారు.

◆ నేడు రేబీస్ ఉచిత టీకా

నర్సాపూర్: పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉచితంగా రేబిస్ టీకాలు వేయనున్నట్లు స్థానిక పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ జనార్దన్‌రావు పేర్కొన్నారు. పెంపుడు కుక్కలు, పెంపుడు పిల్లులకు రేబిస్ వ్యాధి టీకాలు వేస్తామని చెప్పారు. వాటిని పెంచుకునే వ్యక్తులు తమ ఆసుపత్రికి తీసుకొచ్చి టీకాలు చేయించాలని ఆయన కోరారు.

◆ కిషన్‌రెడ్డి ఎంపికపై హర్షం

పెద్దశంకరంపేట(మెదక్): బీజెపి రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఎంపికపై మండల అధ్యక్షుడు కోణం విఠల్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈటెల రాజేందర్‌కు ఎన్నికల నిర్వాహణ కమిటీ చైర్మన్‌గా నియమించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రావణ్‌కుమార్, సాయిలు, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

◆ డిప్యూటీ తహసీల్దార్ బదిలీ

నర్సాపూర్: నర్సాపూర్ రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న నవీన్ బదిలీ అయ్యారు. ఆయన కామారెడ్డి జిల్లాకు మ్యూచువల్ బదిలీ కోసం దరఖాస్తు చేసుకోగా ఆయనను బదిలీ చేస్తు వారం క్రితం ఉత్తర్వులు రావడంతో మంగళవారం రాత్రి రిలీవ్ చేశారు. కాగా ఆయన స్థానంలో ఇంకా ఎవరిని నియమించలేదు.

◆ డిజిటల్ లావాదేవీలపై అవగాహన



పెద్దశంకరంపేట(మెదక్): డిజిటల్ లావాదేవీలపై మహిళా సంఘాల సభ్యులు అవగాహన పెంచుకోవాలని ఎస్‌బిఐ కౌన్సిలర్‌లు మహేశ్వర్‌గౌడ్, అజయ్‌కుమార్‌లు అన్నారు. బుధవారం గ్రామైఖ్య సంఘంలోని మహిళలకు ఆర్థిక అక్షరాస్యతతో పాటు డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూపీఐ లావాదేవీలు జరిపే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏటీఎం నంబర్లు, పాస్‌వర్డులు ఎవరికీ చెప్పొదన్నారు.

◆ మొక్కలు నాటేందుకు అనువైన సమయం

కొల్చారం(నర్సాపూర్): వర్షాకాలం మొదలై వర్షం కురిసిన ప్రస్తుతరుణంలో మొక్కలు నాటేందుకు ఇదే అనువైన సమయమని మండలం కిష్టాపూర్ గ్రామ సర్పంచ్ తిరునగరి గోదావరి గ్రామ ప్రజలకు సూచించారు. బుధవారం హరితహారం కింద ప్రతి ఇంటి ముందు మొక్కలు నాటాలంటూ గ్రామస్తులకు మొక్కలు అందజేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మమత,ఫీల్డ్ అసిస్టెంట్ యాదగిరి, అంగన్వాడీ టీచర్లు శోభ,శ్రీమతమ్మ పాల్గొన్నారు.

◆ దరఖాస్తుల ఆహ్వానం

కౌడిపల్లి(నర్సాపూర్): ఎంజేపీ (మహాత్మ జ్యోతిబా పూలే)బీసీ డిగ్రీ బాలుర గురుకుల కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి మెదక్ జిల్లా ఆర్‌సీఓ (రీజనల్ కోఆర్డినేటర్) ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లీష్, పొలిటికల్‌సైన్స్, హిస్టరి, కంప్యూటర్‌సైన్స్, బొటని, జువాలజీ, కామర్స్, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రరీయన్, స్టాఫ్‌నర్స్ పోస్టులకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. సంబంధిత కోర్సులలో పీజీ పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులని చెప్పారు.

◆ ఘనంగా ప్రశాంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట మండల బీఆర్‌ఎస్ నాయకుడు ప్రశాంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల యువకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

◆ ర్యాలీకి తరలిన మండల నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): గజ్వేల్‌లో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యూత్ ర్యాలీకి మండల కాంగ్రెస్ నాయకులు తరలి వెళ్లారు. బుధవారం మనోహరాబాద్ మండలంలోని పలు గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు బైక్‌లపై ర్యాలీగా వెళ్లారు. ఈ ర్యాలీని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు వీరబోయిన గోపాల్‌లు ప్రారంభించారు.

◆ నేటి నుంచి గ్రామ పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె

మెదక్ కలెక్టరేట్: నేటి నుంచి గ్రామపంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె ప్రారంభించనున్నట్లు సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, జీఓ నెంబర్ 60 ప్రకారం వేతనం చెల్లించాలని, మల్టీపర్పస్ పని విధానాన్ని రద్దు చేయాలన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త సమ్మె నిర్వహిస్తామన్నారు.

◆ బీజేపీ విస్తారక్‌లకు వీడ్కోలు

చేగుంట(తూప్రాన్): దుబ్బాక నియోజకవర్గంలో వారం రోజుల పాటు పనిచేసిన తమిళనాడు బీజేపీ విస్తారక్‌లకు బుధవారం నాయకులు వీడ్కోలు పలికారు. చేగుంట ఐబీ గెస్ట్‌హౌజ్‌లో సమావేశం ఏర్పాటు చేసి నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో పనిచేసిన తమిళనాడుకు చెందిన బీజేపీ నాయకులకు శాలువా కప్పి సన్మానం చేసి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, దుబ్బాక అసెంబ్లీ కన్వీనర్ ఎస్ఎన్ చారి, కోకన్వీనర్ గోవింద్, మండల శాఖ అధ్యక్షుడు భూపాల్, సంతోష్‌రెడ్డి, నర్సింలు, ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గణేష్‌రవికుమార్, మాజీ సర్పంచు రఘువీర్ పాల్గొన్నారు.

◆ బ్యాంకు, పోస్టాఫీస్ నుంచే డబ్బులు తీసుకోవాలి

శివ్వంపేట(నర్సాపూర్): ఉపాధిహామీ కూలీ డబ్బులను బ్యాంకులు, పోస్టాఫీస్ నుంచి తీసుకోవాలని కూలీలకు ఏపీఓ అనీల్‌కుమార్ సూచించారు. ఉపాధి పనుల డబ్బులు వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారన్నారు. కొందరు వ్యక్తులు ప్రయివేటు బ్యాంకులకు సంబంధించి డబ్బుల చెల్లింపుల్లో, మోసాలు, ఇబ్బందులకు గురి చేస్తున్న విషయం వెలుగులోకి వచ్చిందన్నారు.

◆ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

మనోహరాబాద్(తూప్రాన్): హరితహారంలో భాగంగా ఇంటింటికీ మొక్కలు అందించాలని, ప్రతీ ఒక్కరు మొక్కలు నాటేలా చూడాలని డీఎల్‌పీఓ శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం మనోహరాబాద్ మండలం గౌతోజీగూడెంలో హరితహారంలో భాగంగా ఇంటింటికీ మొక్కల పంపిణీలో ఆయన పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్ నూతన అధ్యక్షుల నియామకం

మెదక్‌జోన్: మెదక్ నియోజకవర్గంలోని ఆరు మండలాలు, రెండు పట్టణాల్లో కాంగ్రెస్ అధ్యక్షులను నియమిస్తూ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి బుధవారం ఆదేశాలు జారీచేసినట్లు మెదక్ పట్టణా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ అధ్యక్షుడిగా శంకర్, పాపన్నపేటకు గోవింద్ నాయక్, చిన్నశంకరంపేటకు పి.రమణ, రామాయంపేటకు శ్యాంరెడ్డి, రామాయంపేట పట్టణాధ్యక్షుడిగా యాదగిరి, హవేళిఘణాపూర్‌కు శ్రీనివాస్, నిజాంపేటకు లింగంగౌడ్‌లను నియమించారు.

వెల్దుర్తిలో..

వెల్దుర్తి(తూప్రాన్): ఉమ్మడి వెల్దుర్తి మండలంలోని వెల్దుర్తి, మాసాయి పేట్ మండలాలకు కాంగ్రెస్ అధ్యక్షులను విడివిడిగా ప్రకటించింది. వెల్దుర్తి మండలానికి ఉప్పులింగా పూర్ గ్రామానికి చెందిన గొంగిరెడ్డి గారి మహేష్ రెడ్డి, మాసాయి పేట్‌కు అదే గ్రామానికి చెందిన శ్రీకాంత్ రెడ్డి లను నియమిస్తూ టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేసినట్లు నూతన అధ్యక్షుడు మహేష్ రెడ్డి తెలిపారు.

నర్సాపూర్‌లో..

నర్సాపూర్: నర్సాపూర్ నియోజకవర్గంలోని మండల కాంగ్రెస్ కమిటీలను నియమిస్తూ రాష్ట్ర పార్టీ వర్కింగ్ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నర్సాపూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆయా మండలాలకు పార్టీ అధ్యక్షులను నియమిస్తూ ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. గుర్రాల మల్లేష్(నర్సాపూర్), శ్రీనివాస్‌రావు (కౌడిపల్లి), మల్లేష్‌గౌడ్(కొల్చారం), సుదర్శన్‌గౌడ్ (శివ్వంపేట), నారాయణరెడ్డి (చిలిపిచెడ్) లకు నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

చేగుంటలో..

చేగుంట(తూప్రాన్): కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడిగా చేగుంటకు చెందిన వడ్లనవీన్‌ను నియమిస్తూ పార్టీ అధిష్టానం నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు మండల ప్రచార కమిటీ సభ్యుడు స్టాలిన్ నర్సింలు తెలిపారు. నియోజకవర్గంలో ఏడు మండలాలకు నూతన మండల శాఖ అధ్యక్షులను నియమిస్తూ టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి ఉత్తర్వులు పంచించినట్లు తెలిపారు.